



పిల్లల చికిత్స కేంద్రానికి ప్రచారమేదీ?

● అత్యాధునిక పరికరాలున్నా పనిలేక ఖాళీగా సిబ్బంది

చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి అవరణలోని డీఈఐసీ భవనం

పిల్లలు ఆరోగ్యంగా పెరగాలనే లక్ష్యంతో జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ బాలల స్వస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) కింద చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి అవరణలో సత్వర చికిత్స కేంద్రం (డీఈఐసీ)నడుస్తోంది.18 ఏళ్లలోపు పిల్లల ఆరోగ్య పరిస్థితులను ఈ కేంద్రంలో గుర్తించి చికిత్స అందిస్తున్నారు. చిన్నారుల్లోని 4డీస్(డిఫెక్ట్, డీసీజెస్, డిఫార్మాటీస్, డెవలప్‌మెంట్) గమనించి... వాటి ఆధారంగా వైద్య సేవలందించడం ఈ కేంద్రం ప్రత్యేకత.

- చిత్తూరు రూరల్, ఆంధ్రజ్యోతి

ఇలా గుర్తిస్తారు

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉన్న వైద్య సిబ్బంది ఇంటింటికీ, అంగన్‌వాడీ కేంద్రాలకు, పాఠశాలలకు వెళ్తారు.జన్యులోపాలు, నూరల్ ట్యూబ్ లోపం, డౌన్ సిండ్రోమ్, గ్రహణ మొర్రి, వంకర పాదాలు, గుండె జబ్బులు, నడుము మీద కాయలు, వినికిడిలోపం, కంటి సమస్యలు, దంత సమస్యలు, గాయిటర్, ఆటిజమ్, అంధత్వం, మానసిక వైకల్యం తదితర సమస్యలతో బాధపడుతున్న పిల్లల్ని గుర్తిస్తారు. వారిని డీఈఐసీ కేంద్రానికి ప్రత్యేక వాహనం ద్వారా పంపుతారు. అక్కడ నిపుణులైన వైద్యులతో పరీక్షలు చేయించి చికిత్స అందిస్తారు. ఆరు నెలలకోసారి సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి... ఇలాంటి లక్షణాలతో బాధపడుతున్నవారిని గుర్తించి తగిన వైద్యసేవలందేలా చూస్తారు.

అందించే సేవలు ఇవీ...

జన్యులోపం, గ్రహణ మొర్రి, పుట్టుకతో వచ్చే గుండె లోపాలు, వినికిడి, దంత సమస్యలు, చర్మ, మూర్ఛ వ్యాధులు, బుద్ధిమాంద్యం, మాటలు నేర్చుకోవడంలో ఆలస్యం తదితర రుగ్మతలకు సంబంధించి 18 ఏళ్లలోపు వారికి జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రంలో సేవలందిస్తారు.




అందుబాటులో ఉన్న అడియోమెట్రీ పరికరం - పిల్లలు లేక ఖాళీగా దర్శనమిస్తున్న కేంద్రం

సిబ్బంది ఇలా....

ఈ కేంద్రంలో మొత్తం 14 మంది సిబ్బంది ఉంటారు. అందులో వైద్యాధికారి, చిన్నపిల్లల వైద్య నిపుణుడు, దంత వైద్య నిపుణుడు, ఫిజియోథెరపిస్టు, క్లినికల్ సైకాలజిస్ట్, ఆడియాలజిస్ట్, స్పీచ్ థెరపిస్ట్, ఆప్టో మెట్రీషియన్, ఇద్దరు స్టాఫ్‌నర్సులు, స్పెషల్ ఎడ్యుకేటర్, ల్యాబ్ టెక్నీషియన్, సోషల్ వర్కర్, డేటాఎంట్రీ ఆపరేటర్, మేనేజర్ ఉంటారు. అయితే 14 మందిలో డేటాఎంట్రీ ఆపరేటర్ తిరుపతికి డిప్యుటేషన్‌పై, ఒక స్టాఫ్‌నర్సు మెటర్నిటీ లీవ్‌లో వెళ్లారు మెడికల్ ఆఫీసర్ పోస్టు ఖాళీగా ఉంది. ఉన్నవారు సైతం సక్రమంగా రావడం లేదని ఆరోపణలున్నాయి.

● లోపించిన ప్రచారం

జిల్లాలో ఏకైక బాలల సత్వర చికిత్స కేంద్రంపై ప్రచారం లోపించడం ప్రత్యేక అవసరాల పిల్లలకు శాపంగా మారింది. వైద్య నిపుణులు, పరికరాలు అందుబాటులో ఉన్నా... కేంద్రం ఉందనే విషయం చాలామందికి తెలియక వినియోగించుకోవడం లేదు.ఇప్పటికైనా ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రద్ధ తీసుకుని కేంద్రంపై ప్రచారం నిర్వహించి పిల్లలకు వైద్య సేవలు అందేలా చేయాల్సి వుంది.

యూపీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు అర్హత కలిగిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు విజయవాడలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ సాధికారిత, సంక్షేమ అధికారి రబ్బాని బాష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 17 నుంచి 25వ తేదీలోపు జిల్లా వెనుకబడిన సంక్షేమశాఖ కార్యాలయంలో దరఖాస్తులను ఇవ్వాలన్నారు. డిసెంబరు 5న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి మెరిట్ ఆధారంగా విజయవాడలో శిక్షణ ఇస్తారన్నారు. ఇందులో బీసీలకు 66 శాతం, ఎస్సీలకు 20, ఎస్టీలకు 14 శాతం రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక చేస్తారన్నారు. ఎంపికైన వారికి ఎన్టీయార్ జిల్లాలోని గొల్లపూడిలో ఉన్న బీసీ భవన్ లో శిక్షణ ఉంటుందన్నారు. దరఖాస్తు చేయాలనుకునే అభ్యర్థులు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కుల లిస్టులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసుపుస్తకం, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు అతికించి నేరుగా దరఖాస్తులను కలెక్టరేట్‌లోని బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో ఇవ్వాలన్నారు. ఇతర వివరాలకు 9177429494 నెంబరును సంప్రదించాలన్నారు.





1,2 తరగతుల విద్యార్థులకు 80 మార్కుల ప్రశ్నపత్రం!

చిత్తూరు సెంట్రల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో జరుగుతున్న సమ్మేటివ్ పరీక్షల్లో చిన్నారులు గందరగోళ పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఈనెల 10వ తేదీ నుంచి సమ్మేటివ్-1 పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఒకటి, రెండు తరగతుల విద్యార్థులకు ఇచ్చిన 80 మార్కుల ప్రశ్నపత్రం చూస్తే ఎవరికైనా ఆశ్చర్యం కలుగుతుంది. ప్రాథమిక విద్యార్థుల మానసిక శక్తిని పరిగణనలోకి తీసుకోకుండా పరీక్ష పెడుతోన్న విద్యాశాఖ అధికారుల తీరుపై ఉపాధ్యాయ వర్గాలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి. పరీక్ష సమయం 2.30 గంటలు నిర్ణయించగా, ప్రశ్నల పొడవు, కఠినత చూస్తే ఇది పిల్లల పరీక్షా పత్రమేనా అనే సందేహం కలుగుతుంది.ఉపాధ్యాయుల నుంచి అభిప్రాయాలు సేకరించి ప్రశ్నపత్రాల రూపకల్పనలో మార్పులు తేవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

19 నుంచి విభిన్న ప్రతిభావంతుల ఉపకరణాల గుర్తింపు శిబిరాలు

చిత్తూరు అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు ఉపకరణాల కోసం ఈ నెల 19 నుంచి 26వ తేది వరకు గుర్తింపు శిబిరాలను నిర్వహించనున్నట్లు ఆ శాఖ ఇన్‌ఛార్జి అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19వ తేది చిత్తూరు పీవీకేఎన్ డిగ్రీ కళాశాల, 20న కార్వేటినగరంలోని జడ్పీ హైస్కూల్, 21న ఐరాలలోని జడ్పీ హైస్కూల్, 22న నగరి పీసీఎన్ ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో గుర్తింపు శిబిరాలు జరుగుతాయన్నారు. అలాగే 23న సదుం జడ్పీ హైస్కూల్లో, 24న వి.కోట జడ్పీ హైస్కూల్లో, 25న గుడుపల్లె జడ్పీ హైస్కూల్లో, 26న శాంతిపురం జడ్పీ హైస్కూల్లో గుర్తింపు శిబిరాలు ఉంటాయన్నారు. ఈ శిబిరాలకు హాజరయ్యే దివ్యాంగులు నాలుగు వికలత్వ ఫొటోలు, ఆధార్‌కార్డు, సదరం సర్టిఫికెట్, యూడీఐడీ కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్‌లను తీసుకురావాలన్నారు.

■ ప్రకృతి చెక్కిన శిల్పాలు

చిత్తూరు నగర శివార్లలోని ఇరువారం కొండపై ఓ గుండు రాక్షస బల్లి ఆకారంలో కనపడుతుండడంతో కొండపైకి వెళ్లేవారంతా దీన్ని ఫొటో తీసుకుంటుంటారు. అలాగే గంగాసాగరం గుట్టపై ఉన్న ఈ పెద్దగుండు దూరం నుంచి చూస్తే మనిషి మెడభాగం నుంచి తలను పోలిన ఆకారం కనపడుతోంది.

వరసిద్ధుడి దర్శనానికి 3 గంటల సమయం



ఐరాల(కాణిపాకం), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడి దర్శనానికి శనివారం మూడు గంటల సమయం పట్టింది. స్వామి దర్శనానికి వేలాదిగా భక్తులు విచ్చేయడంతో ఆలయం వద్ద రద్దీ వాతావరణం ఏర్పడింది. క్యూలైన్లు నిండి వెలుపలకు విస్తరించాయి. ప్రతి భక్తుడికి స్వామి దర్శనం కల్పించడానికి ఈవో పెంచలకిషోర్ క్యూలైన్లను దగ్గరుండి పర్యవేక్షించారు. ఆలయంలో రద్దీ సాయంత్రం వరకు కొనసాగింది.

ప్రపంచ కప్ మొక్కు చెల్లించా

● తిరుమలలో తలనీలాలు సమర్పించిన క్రికెటర్ శ్రీచరణి

తిరుమల, నవంబరు15(ఆంధ్రజ్యోతి): 'ప్రపంచకప్ ఆడటానికి ముందే శ్రీవేంకటేశ్వర స్వామికి మొక్కుకున్నా. విజయం లభించింది. మొక్కు చెల్లించుకోవడానికి తిరుమలకు వచ్చా'నని మహిళా క్రికెటర్ శ్రీచరణి తెలిపారు. శనివారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి ఆమె శ్రీవారిని దర్శించుకున్నారు. ప్రస్తుతం తాను డొమెస్టిక్ ఆడుతున్నట్టు ఆమె మీడియాకు తెలిపారు. కాగా, శుక్రవారం అలిపిరి నుంచి కాలినడకన తిరుమల చేరుకున్న శ్రీచరణి స్వామివారికి తలనీలాలు సమర్పించారు. కాగా, శ్రీవారి దర్శనానంతరం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడిని శ్రీచరణి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెను శాలువాతో చైర్మన్ సత్కరించి అభినందించారు. శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.



శ్రీచరణిని అభినందిస్తున్న టీటీడీ చైర్మన్

రూ.71.728 కోట్లతో సీఎంసీ క్యాంపస్ విస్తరణ



సీఎం చంద్రబాబుతో సీఎంసీ డైరెక్టర్లు

గుడిపాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):గుడిపాల మండలంలోని 190రామాపురం వద్ద వున్న సీఎంసీ క్యాంపస్‌ను వచ్చే పదేళ్లలో రూ.71.728 కోట్లతో విస్తరించనున్నారు.ఇందులో కొత్త టీచింగ్ ఆస్పత్రి, మెడికల్ కాలేజి, ఆధునిక వైద్య మౌళిక సదుపాయాల ఏర్పాట్లు ఉన్నాయి. ఈ పెట్టుబడి ద్వారా 1,226 ప్రత్యక్ష ఉద్యోగాలు, 5 వేల నుంచి 6 వేల వరకు పరోక్ష ఉద్యోగాలు కల్పించబడతాయి. విశాఖ వేదికగా జరుగుతున్న సీఐఐ పారిశ్రామిక భాగస్వామ్య సదస్సులో ఈ మేరకు సీఎంసీ వేలూరు డైరెక్టర్ డాక్టర్ విక్రమ్ మ్యాథ్యూస్ తదితరులు రాష్ట్రప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా విక్రమ్ మ్యాథ్యూస్ మాట్లాడుతూ ఈ ఒప్పంద లక్ష్యం ఆరోగ్య సంరక్షణతో పాటు వైద్యవిద్యను అభివృద్ధి చేయడమే అన్నారు. తమిళనాడులోని వేలూరు సీఎంసీలో ప్రస్తుతం 3701 పడకల బహుళ ప్రత్యేక ఆస్పత్రి ద్వారా సంవత్సరానికి 34 లక్షలకు పైగా గదుల్లో రోగులకు సేవలందిస్తుండగా 2012లో ప్రారంభమైన చిత్తూరు క్యాంపస్ నాన్ ప్రాఫిట్ మోడల్‌పై పని చేస్తున్న విషయం తెలిసిందే అన్నారు.

చిన్నగొట్టిగల్లు సింగిల్‌విండో సీఈవో సస్పెన్షన్



చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లు సింగిల్ విండోలో నకిలీ బంగారాన్ని కుదువ పెట్టి రూ. 72 లక్షలు స్వాహా చేసి ఘటనకు సంబంధించి అక్కడి సీఈవో జగదీశ్‌ను సస్పెండ్ చేస్తూ సింగిల్ విండో అధ్యక్షుడు ముత్తా ప్రభాకర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది జనవరి 18, 21, ఫిబ్రవరి 11 తేదీలలో 1235 గ్రాముల వన్‌గ్రామ్ గోల్డ్‌ను 29 సంచుల్లో కె.రెడ్డెమ్మ, సి.రుతున్ పేరిట కుదువపెట్టి రూ. 72 లక్షలు అక్కడి సీఈవో జగదీశ్ స్వాహా చేశారు. ఈ వ్యవహారాన్ని చిన్నిగొట్టిగల్లు డీసీసీబీ బ్రాంచి మేనేజర్ లక్ష్మీప్రసాద్ గుర్తించి అధికారులకు ప్రాథమిక నివేదికను ఇచ్చారు. జగదీశ్ స్థానంలో బ్యాంకు సూపర్‌వైజర్ రెడ్డి శ్రావణ్‌ను నియమించారు. ఇదిలా ఉండగా సింగిల్ విండోలో వీటితో పాటు కుదువ ఉంచిన బంగారం వివరాలను బ్యాంకు అధికారులు పరిశీలిస్తున్నారు. డీసీసీబీ ఏజీఎం సురేష్‌బాబు విచారణ చేపట్టారు. త్వరలో ఈ సంఘటనపై సీఈవో జగదీశ్‌పై పోలీసు కేసు నమోదు చేసే అవకాశం ఉంది.



ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దండి

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాను ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని డీఆర్వో మోహన్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్ ఆవరణలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంలో స్వచ్ఛత - ప్లాస్టిక్ నిర్మూలనపై నిర్వహించిన కార్యక్రమాన్ని డీఆర్వో ప్రారంభించారు. అక్కడి ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించి మానవాళి మనుగడకు ప్లాస్టిక్‌ను నిర్మూలించడం ఎంతో అవసరమన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని ఆపి జ్యూట్‌బ్యాగులను వినియోగించాలన్నారు. దుకాణదారులు, సూపర్‌మార్కెట్లు వినియోగదారులకు ప్లాస్టిక్ బ్యాగుల బదులు, క్లాత్ బ్యాగులు లేదా తక్కువ ధరతో కూడిన జ్యూట్ బ్యాగులను ఇవ్వాలని సూచించారు. స్టీల్‌వాటర్ బాటిల్స్, జ్యూట్ బ్యాగుల వినియోగంపై విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో వాసుదేవన్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్లు విధివిధానాలపై అవగాహన అవసరం

● జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు

చిత్తూరు రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జూనియర్ అసిస్టెంట్లు విధివిధాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు తెలిపారు. శనివారం చిత్తూరు జడ్పీ సమావేశ మందిరంలో జూనియర్ అసిస్టెంట్లతో సీనియారిటీ జాబితా, రోస్టర్ పాయింట్లు, ఇతర సేవా సంబంధిత అంశాలపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్యాలయంలో పనిచేసే జూనియర్ అసిస్టెంట్లు చాలా బాధ్యతగా పనిచేయాలన్నారు. కార్యాలయానికి వచ్చే ప్రజలతో మర్యాదగా మాట్లాడాలన్నారు. వారి సమస్యలను సామరస్యంగా పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా జూనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కిడ్నీ రాకెట్ కేసులో వీడిన మిస్టరీ

● డాక్టర్, టెక్నీషియన్లే సూత్రధారులు
● డీసీహెచ్ఎస్ సహా ఆరుగురి అరెస్టు
● 'గ్లోబల్'లో ఒకేరోజు ఇద్దరికి కిడ్నీ మార్పిడి
● విశాఖకు చెందిన మహిళ యమున మృతి



కిడ్నీ మార్పిడి కేసులో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న మదనపల్లె డీఎస్పీ మహేందర్, ఇతర పోలీసులు. చిత్రంలో నిందితులు(ముసుగు)

మదనపల్లె, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):మదనపల్లెలో వెలుగు చూసిన కిడ్నీ రాకెట్ కేసులో మిస్టరీ వీడింది. డయాలసిస్ కేంద్రాల్లో పనిచేసే ఇద్దరు మేనేజర్లు, విశాఖ ప్రాంతానికి చెందిన ఇద్దరు మధ్యవర్తులతో అన్నమయ్య జిల్లా డీసీహెచ్ఎస్, బెంగళూరుకు చెందిన కిడ్నీ మార్పిడి డాక్టర్లు దీనిలో కీలకపాత్ర పోషించినట్లు గుర్తించారు. ఈ క్రమంలో ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మరో ఎనిమిది మంది నిందితులను గుర్తించారు. ఈ కేసులో కీలకంగా మారిన బెంగళూరుకు చెందిన వైద్యుడు పరారీలో ఉన్నారు. ఈ కిడ్నీ రాకెట్ ముఠా కేసుకు సంబంధించిన వివరాలను మదనపల్లె డీఎస్పీ మహేందర్.. శనివారం మీడియాకు వివరించారు.

డబ్బు ఆశ చూపి..

విశాఖపట్నానికి చెందిన ఎస్. యమున(29) ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారు. ఈ విషయాన్ని గ్రహించిన అదే ప్రాంతానికి చెందిన పిల్లి పద్మ, సత్యలు కిడ్నీ ఇస్తే డబ్బులు వస్తాయని ఆశ చూపారు. తాను కూడా ఇప్పటికే కిడ్నీ విక్రయించినట్లు పద్మ తెలిపింది. ఇదే విషయాన్ని యమునతో సహజీవనం చేస్తున్న సూరిబాబుకు కూడా చెప్పారు. ఈ ముగ్గురూ కలసి యమున కిడ్నీ ఇచ్చేలా ఒప్పించారు. అనంతరం.. మదనపల్లె, సత్యసాయి జిల్లా కదిరి డయాలసిస్ కేంద్రాల్లో మేనేజర్లుగా పనిచేస్తున్న బాల రంగడు అలియాస్ బాలు, మోహరాజ్‌లను పద్మ, సత్య సంప్రదించారు. వారి సూచన మేరకు యమునను మదనపల్లెకు తీసుకొచ్చి గ్లోబల్ ఆసుపత్రి యజమాని, డీసీహెచ్ఎస్‌గా పనిచేస్తున్న డాక్టర్ కె. ఆంజనేయులును సంప్రదించారు. ఈ నెల 9న గ్లోబల్ ఆసుపత్రిలో యమునను చేర్చారు. అప్పటికే బెంగళూరు నుంచి వచ్చిన కిడ్నీ ఆపరేషన్ స్పెషలిస్టు, ఇద్దరు సాంకేతిక సిబ్బందితో కలిసి గ్లోబల్ ఆసుపత్రిలో ఒక డోనర్ నుంచి కిడ్నీ తొలగించి, రిసీవర్‌కు ఆపరేషన్ చేశారు. అదే రోజురాత్రి యమున నుంచి కిడ్నీ తొలగించి మరో రిసీవర్‌కు సర్జరీ చేశారు. అంతవరకు బాగానే ఉన్నా.. తర్వాత యమున ఆరోగ్య పరిస్థితి విషమించడంతో పదో తేదీ ఉదయం ఆమె మృతిచెందారు. కంగారు పడిన కిడ్నీ ముఠా బృందం యమున మృతదేహాన్ని హుటాహుటిన మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ పోస్టుమార్టానికి సరైన వసతులు లేకపోవడంతో తిరిగి తిరుపతి రుయాకు తరలించి ప్రక్రియ పూర్తిచేసి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

ఇతర రాష్ట్రాలకు బృందాలు

యమున తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. గ్లోబల్ ఆసుపత్రి యజమాని డాక్టర్ కె. ఆంజనేయులు, డయాలసిస్ కేంద్రాల మేనేజర్లు బాలరంగడు, మోహరాజ్, మధ్యవర్తులు పిల్లి పద్మ, సత్య సహా యమున వెంట వచ్చిన సూరిబాబులను అరెస్టు చేశారు. ఆపరేషన్‌లో కీలకంగా వ్యవహరించిన బెంగళూరు వైద్యుడు పరారీలో ఉన్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ఇదే కేసులో మరో ఎనిమిది నిందితులను గుర్తించామని, వీరిని కూడా త్వరలో అరెస్టు చేస్తామన్నారు. వీరిలో మొదటి రిసీవర్‌కు కిడ్నీ ఇచ్చిన వ్యక్తి, ఇద్దరు కిడ్నీ రిసీవర్లు, బెంగళూరు డాక్టర్‌కు సహకరించిన ఇద్దరు టెక్నీషియన్లు, యమున మృతదేహాన్ని తిరుపతి, మదనపల్లెకు తరలించిన అంబులెన్స్ డ్రైవర్ సహా మరో ఇద్దరిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు. ఈ కేసును ఛేదించడానికి 4 ప్రత్యేక బృందాలను నియమించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ఈ బృందాలు ఏపీ, గోవా, కర్ణాటక, తెలంగాణలో నిందితులకోసం గాలిస్తున్నట్లు చెప్పారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా కిడ్నీ ఆపరేషన్లు చేస్తున్న ఆసుపత్రిపై మరింత లోతుగా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వివరించారు.

పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలకు

నేడు అంకురార్పణ

● ఉదయం లక్ష కుంకుమార్చన ● రేపు ధ్వజారోహణంతో మొదలుకానున్న వాహన సేవలు



విద్యుత్ దీపాలంకరణలో ఆలయం

తిరుచానూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దేవేరి పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు ఆదివారం సాయంత్రం అంకురార్పణ జరగనుంది. సోమవారం నుంచి జరిగే ఉత్సవాలకు తిరుచానూరు సిద్ధమైంది. అంకురార్పణ రోజు ఉదయం లక్ష కుంకుమార్చన నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పాంచరాత్ర ఆగమోక్తంగా అర్చకులు అమ్మవారి అష్టోత్తర శతనామావళిని లక్ష సార్లు జపిస్తూ కుంకుమార్చన చేస్తారు. ఈ సేవలో పాల్గొనదలచిన దంపతులు రూ.1116 టిక్కెట్ కొనాలి. కుంకుమార్చనను భక్తులు కూర్చొని తిలకించేందుకు వీలుగా మండపాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఇక, తొమ్మిది రోజుల పాటు ఎటువంటి అవరోధాలు, ఆటంకాలు కలగకుండా బ్రహ్మోత్సవాలు జరగాలని సకల దేవతలను, అష్టదిక్పాలకులను ఆహ్వానిస్తూ సాయంత్రం అంకురార్పణ గావిస్తారు. ఇందులో భాగంగా అమ్మవారికి, విష్వక్సేనుడికి ఆలయంలో పూజలుచేస్తారు. అమ్మవారిని తిరుచ్చిపై కొలువుదీర్చి ఉద్యానవనానికి వేంచేపు చేస్తారు. వెంట సర్వసేనాధిపతి విష్వక్సేనుడూ చేరుకుంటారు. అక్కడి పుట్టమట్టి సేకరించి ఆలయంలోని యాగశాలకు చేరుకుని పాలికల్లో పుట్టమట్టి, నవధాన్యాలు నింపి అంకురార్పణ చేస్తారు.





రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

సోమవారం ఉదయం 8-9 గంటల మధ్య ధనుర్లగ్నంలో నిర్వహించే ధ్వజారోహణంతో అమ్మవారి బ్రహ్మోత్సవాలు మొదలు కానున్నాయి. గజపటాన్ని ధ్వజస్తంభానికి ఆరోహణం చేస్తారు. దీంతో ఉత్సవాలకు సకలదేవతలను ఆహ్వానిస్తారు. ఇక, రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. రాత్రి ఏడు గంటలకు చిన్నశేషవాహనంతో అమ్మవారి వాహన సేవలు ప్రారంభమవుతాయి. రోజూ ఉదయం 8 గంటలకు, రాత్రి 7 గంటలకు అమ్మవారు వాహనాల్లో మాడవీధుల్లో ఊరేగుతున్నారు. ఆయావాహనాలను సిద్ధం చేశారు. విద్యుద్దీపాలంకరణలతో తిరుచానూరు దేదీప్యమానంగా వెలుగులీనుతోంది.

వాహన సేవలిలా..

తొలిరోజైన 17వ తేది సాయంత్రం చిన్నశేషవాహనం, 18న పెద్దశేష హంస.. 19న ముత్యపుపందిరి, సింహ.. 20న కల్పవృక్ష, హనుమంత.. 21న పల్లకీ ఉత్సవం, సాయంత్రం 4 గంటలకు వసంతోత్సవం, రాత్రి గజవాహనం.. 22న సర్వభూపాల, సాయంత్రం స్వర్ణరథోత్సవం రాత్రి గరుడ వాహనం.. 23న సూర్యప్రభ, చంద్రప్రభ.. 24న రథోత్సవం, అశ్వవాహనంపై అమ్మవారు ఊరేగనున్నారు. దీంతో వాహన సేవలు ముగుస్తాయి. 25న మధ్యాహ్నం 12.10 గంటలకు పంచమితీర్థం(చక్రస్నానం), సాయంత్రం ధ్వజావరోహణం, 26న పుష్పయాగం జరగనుంది.

పది రోజుల పాటు ఆర్జిత సేవలు రద్దు

బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పది రోజులపాటు ఆలయంలో జరిగే అన్ని ఆర్జిత సేవలను రద్దు చేసినట్లు డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్ తెలిపారు. కుంకుమార్చన, వీఐపీ బ్రేక్, కల్యాణోత్సవంతో పాటు వారపు, మాసపు ఆర్జిత సేవలు ఉండవన్నారు. ఈనెల 27 నుంచి ఆర్జిత సేవలు పునఃప్రారంభమవుతాయని వివరించారు.

నాలుగు పంచాయతీల్లో ఏనుగుల హల్‌చల్

● మామిడి, కొబ్బరి, అరటి, వరి, మిరప పంటలు ధ్వంసం





ఏనుగుల దాడిలో ధ్వంసమైన టమోటా పంట - వరిపంట

కల్లూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలోని పొలాల్లో ప్రతి రాత్రి బీభత్సం సృష్టిస్తున్న ఏనుగుల మంద శుక్రవారం రాత్రి మండలంలోని పలు పంచాయతీలను చుట్టేశాయి. మండలంలోని నాలుగు పంచాయతీల్లో తిరగాడిన ఏనుగుల మంద వరి, కొబ్బరి, మామిడి, మిరప, అరటి, అనలంద పంటలకు నష్టం కలిగించాయి. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని బోడబండ నుంచి బయలుదేరిన 16 ఏనుగుల మంద కమ్మపల్లి పంచాయతీలోకి చేరుకున్నాయి. బాలిరెడ్డిగారిపల్లి వద్ద మోహన్‌రెడ్డి, మనోజ్‌కుమార్‌రెడ్డి, రామిరెడ్డికి చెందిన మామిడిచెట్ల కొమ్మలను ఏనుగులు విరిచేశాయి. అక్కడి నుంచి కమ్మపల్లిలోని విశ్వనాథనాయుడు కోళ్లఫారం వద్దకు చేరుకున్న ఏనుగుల మంద నానా బీభత్సం చేశాయి. వంకమద్దివారిపల్లి, రెడ్డివారిపల్లి పంచాయతీ తురుకపేట , చిచ్చిలివారిపల్లి, 106 రామిరెడ్డిగారిపల్లి పంచాయతీల్లోని పలు పంటలను ధ్వంసం చేశాయి. గడ్డంవారిపల్లి పంచాయతీ సరిహద్దులోని చిన్నగొట్టిగల్లు మండలంలోకి ప్రవేశించాయి. మంగళంపేట-భాకరాపేట మార్గంలోని చిన్నగొట్టిగల్లు మండలం పరిధిలోని రెడ్డేరిగుట్టలోకి ఏనుగులు చేరుకున్నాయి. శనివారం పగలంతా 16 ఏనుగుల మంద రెడ్డేరిగుట్టలోనే సంచరించినట్లు సిబ్బంది తెలిపారు.

ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ ఒలంపిక్స్ క్రికెట్ జట్టుకు కార్తీక్ ఎంపిక

● క్రికెట్ టీంకు ఇండియా తరపున వి.కోట వాసి ప్రాతినిథ్యం





కార్తీక్‌ను అభినందిస్తున్న ఎంపీపీ యువరాజ్ తదితరులు

వి.కోట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ ఒలంపిక్స్ గేమ్స్ అండర్ -17 క్రికెట్ జట్టుకు వి.కోటకు చెందిన శ్రీనివాసులు కుమారుడు కార్తీక్ ఎంపికయ్యాడు. డిసెంబరు నుంచి శ్రీలంకలో జరుగనున్న ఇంటర్నేషనల్ స్టూడెంట్ ఒలంపిక్స్ గేమ్స్‌లో ఇండియా తరపున క్రికెట్ జట్టుకు కార్తీక్ ప్రాతినిథ్యం వహించనున్నాడు. ఈ మేరకు 17 మంది జట్టు సభ్యులను ఎంపిక చేస్తూ అఖిల భారత స్టూడెంట్స్ ఒలంపిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డా.ప్రదీప్ భరద్వాజ్ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే అండర్ 17 క్రికెట్ జట్టులో ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ కమ్ లెఫ్ట్ ఆర్మ్ ఫాస్ట్ బౌలర్‌గా రాణిస్తున్నాడు. తెలుగు రాష్ట్రాల నుంచి ఎంపికైన క్రీడాకారుడు కావడంతో అతడిని పట్టణ ప్రముఖులు, అఖిల పక్షం నేతలు అభినందించారు. ఎంపీపీ యువరాజ్, వైస్ ఎంపీపీ డా.తమీంఖాన్, అభినందించారు.

రాళ్లబూదుగూరు పోలీస్‌స్టేషన్ తనిఖీ

రామకుప్పం/శాంతిపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం రాళ్లబూదుగూరు పోలీస్‌స్టేషనును శనివారం జిల్లా ఎస్పీ తుషార్‌డూడి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషను నిర్వహణ, పరిసరాలను ఆయన పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాల నిరోధానికి స్టేషను పరిధిలో చేపట్టిన కార్యక్రమాలను సమీక్షించారు. డ్రంకన్ డ్రైవ్, రోడ్డు భద్రత నియమాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని ఎస్ఐ నరేష్‌ను ఆదేశించారు. అలాగే వివిధ కేసుల్లో నిందితులను సత్వరం అరెస్టు చేయాలని ఆదేశించారు. రాళ్లబూదుగూరు, శాంతిపురంతోపాటు పలుచోట్ల ఏర్పాటు చేసిన సీసీకెమెరాల పర్యవేక్షణ, శాంతిపురంలో ఔట్‌పోస్టు నిర్వహణ తీరును ఎస్ఐ నరేష్ ఎస్పీకి వివరించారు. స్టేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కుప్పం రూరల్ సీఐ మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.

స్వచ్ఛత.. సమాజానికి ఇచ్చే బహుమతి: ఎస్పీ



మొక్క నాటి నీరు పోస్తున్న ఎస్పీ తుషార్

చిత్తూరు అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత అనేది మన బాధ్యత మాత్రమే కాదు.. అది సమాజానికి ఇచ్చే బహుమతి అని ఎస్పీ తుషార్ డూడీ చెప్పారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా శనివారం ఎస్పీ జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటి అధికారులు, సిబ్బందిచేత ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్, ఏఆర్ కార్యాలయం, పోలీసు వెల్ఫేర్ ఆస్పత్రి, జిల్లా వ్యాప్తంగా అన్నిపోలీసు స్టేషన్లలో మొక్కలు నాటి పరిసరాలను శుభ్రం చేయించారు. మంచి పరిసరాలుంటే.. మంచి ఆలోచనలు వస్తాయని, ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, డీసీఆర్‌బీ సీఐ చంద్రశేఖర్, ఆర్ఐ వీరేష్, ఏఏవో బాలాజీ, పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బుధ, గురువారాల్లో మండలాల్లో పర్యటించాలి: డీఆర్వో

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రతి బుధ, గురువారాల్లో మండల ప్రత్యేకాధికారులు హెచ్‌వోడీలతో కలిసి మండలంలో పర్యటించాలని డీఆర్వో మోహన్ కుమార్ ఆదేశించారు. శనివారం మండల స్థాయి కార్యాలయాల్లో ప్రజాసమస్యల పరిష్కారం, రెవెన్యూ, పీజీఆర్ఎస్ వినతుల పరిష్కారం వంటి అంశాలపై డీఆర్వో మండల ప్రత్యేకాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ, పాఠశాలలు, హాస్టల్, పీహెచ్‌సీ, సచివాలయం వంటి కార్యాలయాలను సందర్శించాలని చెప్పారు. వారికి కేటాయించిన మండలస్థాయి అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించాలని సూచించారు. సందర్శన సమయంలో ఎక్కడైనా లోపాలు గుర్తిస్తే వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపాలన్నారు. ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను వేరు చేసి ప్రతి సోమవారం కలెక్టర్‌కు నివేదిక ఇవ్వాలని కోరారు.

చిరుత దాడిలో గోమాతల మృత్యువాత

ఐరాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఐరాల మండలం శివారు గ్రామమైన గుండ్లపల్లె వద్ద ఓ ఆవుపై చిరుత దాడి చేసి చంపివేసింది. సుకుమార్ రెడ్డి అనే రైతు శుక్రవారం గ్రామానికి సమీపంలోని పీర్లకొండ రెవెన్యూ గుట్టపై ఆవును మేతకు వదిలి వచ్చాడు. అయితే సాయంత్రం వెళ్లి చూసే సరికి ఆవు గాయాలతో చనిపోయి ఉంది. పాద ముద్రలను గుర్తించిన రైతు వెంటనే అటవీశాఖ అధికారులకు విషయాన్ని తెలియజేశారు.అయితే అప్పటికే చీకటి పడి పోవడంతో శనివారం అటవీశాఖ డీఆర్వో రాకేష్ కుమార్, ఎఫ్‌బీఓవో లావణ్య సంఘటనా స్థలానికి వెళ్లి ఆవు కళేబరానికి పశువైద్యులతో పోస్టుమార్టం నిర్వహించారు. చిరుత దాడిలోనే ఆవు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ సందర్భంగా డీఆర్వో రాకేష్‌కుమార్ మాట్లాడుతూ చిరుత పులుల సంచారం దృష్ట్యా రైతులెవరూ కూడా అటవీ ప్రాంతాలకు పశువులను మేత కోసం తీసుకెళ్లవద్దని సూచించారు.



ఆవుకు పోస్టుమార్టం నిర్వహిస్తున్న వైద్యులు

వెంగంపల్లె వద్ద .....

తవణంపల్లె, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చిరుత పులి దాడి చేసి ఓ పాడి ఆవును చంపేసిన ఘటన శనివారం ఉదయం తవణంపల్లె మండలం వెంగంపల్లె సమీపంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు... వెంగంపల్లెకు చెందిన దేవేంద్రరెడ్డి తన పాడి ఆవును స్థానిక ఎస్టీ కాలనీ సమీపంలో గల తన పొలం వద్ద కట్టివేస్తాడు. శనివారం ఉదయం పాలు పితుక్కుని ఇంటికి వచ్చాక చిరుత పులి దాడి చేసి పాడి ఆవును చంపి కొంత భాగం తిని సమీపంలోని అడవిలోకి వెళ్లిపోయింది. ఆవుకు మేత వేయడానికి వెళ్లిన దేవేంద్రరెడ్డి చిరుత దాడి చేసి ఆవును చంపి తిన్నట్లు గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చాడు. స్థానిక అటవీశాఖాధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆవు కళేబరానికి అక్కడే పశువైద్యులతో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘటనా స్థలంలో చిరుత పాదముద్రలను అటవీశాఖాధికారులు సేకరించారు. ఇరవై రోజుల క్రితం కొండ్రాజుకాల్వ పంచాయతీ ఎస్టీ కాలనీకి చెందిన మూడు మేకలను చిరుత పులి చంపి అడవిలోకి తీసుకెళ్లింది. అలాగే చెర్లోపల్లె, జి.గొల్లపల్లె వద్ద ఆవులపై దాడి చేసి గాయపరిచినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ వరుస సంఘటనలో రైతులు, ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. చిరుత దాడుల నేపథ్యంలో చిరుత ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

టీడీపీతోనే ముస్లింల సంక్షేమం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

వి.కోట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముస్లిం, మైనారిటీల సంక్షేమం టీడీపీ తోనే సాధ్యమని ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు అన్నారు. శనివారం వి.కోటలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం మౌజం, ఇమాంలకు వేతనాలు రూ.90 కోట్లు విడుదల చేయడంపై ముస్లిం, మైనారిటీ నాయకులతో కలిసి సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల సోషల్ మీడియాలో వి.కోట సర్పంచ్ అభ్యర్థిపై వస్తున్న వదంతులను నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రాంబాబు, ఉపాధ్యక్షులు నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, మండల తెలుగు యువత అధ్యక్షులు ధీరజ్, జిల్లా కార్యదర్శి శబరీష్, పీఏసీఎస్ అధ్యక్షులు నారాయణస్వామి, హరినాథరెడ్డి, రుహుల్లా, మండల మైనారిటీ సెల్ అధ్యక్షులు నాసీర్, నేతలు సుబ్బన్న, చంద్రారెడ్డి, రామూర్తి, విశ్వనాథ్, సతీష్, జనార్ధన్‌రెడ్డి, భక్తా, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మక అభ్యసనానికి నో బ్యాగ్ డే ఊతం



విద్యార్థులతో అభ్యసనం చేయిస్తున్న ప్రధానోపాధ్యాయులు చిట్టిబాబు

కుప్పం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి శనివారం అమలు చేస్తున్న నో బ్యాగ్ డే సృజనాత్మక అభ్యసనానికి ఊతం ఇస్తుందని కుప్పం మండలం అడవిబూదుగూరు హరిజనవాడ ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోతుగుంట చిట్టిబాబు అన్నారు. ఈ పాఠశాలలో శనివారం విద్యార్థులు తాము తయారు చేసిన లో కాస్ట్ అభ్యసన సామగ్రి, వర్కింగ్ మోడల్స్‌ను తరగతి గదిలో ప్రదర్శించి తమ సృజనాత్మకతను చాటుకున్నారు. నో బ్యాగ్ డేతో విద్యార్థుల సామర్థ్యాన్ని సృజనాత్మక ఆలోచనా విధానాన్ని పెంపొందించుకునేందుకు పలురకాల సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నవీన్, జయశ్రీ పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి లక్షణాలు గుర్తించాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డాక్టర్ సుధారాణి

పలమనేరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్న కుష్ఠువ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా వ్యాధి లక్షణాలు గుర్తించాలని కొలమాసనపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి సుధారాణి తెలిపారు. శనివారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో పనిచేసే వైద్య ఆరోగ్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెలాఖరు వరకు వైద్య ఆరోగ్యసిబ్బంది ఇంటింటికి వెళ్లి కుష్ఠు వ్యాధిగ్రస్తుల లక్షణాలను పరిశీలించి గుర్తించాలన్నారు. సూపర్‌వైజర్ మధు, ఎంఎల్‌పీహెచ్‌ఎస్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్వాసితులను ఆదుకుంటాం

● ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



రాయలపేటలో రోడ్డును పరిశీలిస్తున్న అమరనాథరెడ్డి

పెద్దపంజాణి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పెద్దపంజాణి మండలంలోని రాయలపేట గ్రామంలో రోడ్డు విస్తరణ పనులు అభిప్రాయ సేకరణ అనంతరం ప్రారంభమవుతాయని .. నిర్వాసితులను ఆదుకుంటామని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. శనివారం గ్రామంలో పర్యటించి రోడ్డును పరిశీలించారు. రోడ్డు విస్తరణలో నష్టపోయే బాధితులతో సమీక్షించారు. అందరి ఆమోదంతోనే పనులు ప్రారంభిస్తామని.. నష్టపోయే ప్రతిఒక్కరినీ ఆదుకుంటామన్నారు. అనంతరం రోడ్డు విస్తరణకు సంబంధించి గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. నాయకులు నోమురాజు, బుద్ధు, బాలసుబ్రహ్మణ్యం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నదీం, రమణ, వీఆర్వో రాజన్న, సర్వేయర్ రోజారమణి పాల్గొన్నారు.

సమయ పాలన పాటించండి



సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న డీపీవో రామచంద్రయ్య

పెద్దపంజాణి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులందరూ సమయ పాలన పాటించాలని డివిజనల్ పంచాయతీ అధికారి రామచంద్రయ్య అన్నారు. శనివారం పెద్దపంజాణి మండలం పెదకాప్పల్లె పంచాయతీలో జరిగిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాల్లో మొక్కలను నాటారు. పెనుగొళకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో సమావేశమయ్యారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించి విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కమ్మపాళ్యం సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి ఉద్యోగులందరూ సమయ పాలన పాటించాలని సూచించారు. ఎంపీడీవో బాలాజీ, డిప్యూటీ ఎంపీడీవో శారదాదేవి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అగస్తీశ్వరుడికి తెప్పోత్సవం



తెప్పోత్సవంలో విహరిస్తున్న పార్వతీదేవి, అగస్తీశ్వరస్వామి

పుంగనూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా పేరుగాంచిన పుంగనూరు మండలం నెక్కొంది కొండపై పుష్కరిణిలో ప్రసన్నపార్వతీదేవి సమేత అగస్తీశ్వరస్వామి తెప్పోత్సవంలో విహరిస్తూ భక్తులను మైమరిపించారు. శనివారం ఆలయ ప్రధాన అర్చకులు షణ్ముక దీక్షితులు ఆధ్వర్యంలో అగస్తీశ్వరస్వామి, ప్రసన్నపార్వతీదేవిలకు అభిషేకాలు, హోమాలు, అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణం చేపట్టారు. అగస్తీశ్వరస్వామి, పార్వతీదేవి ఉత్సవ మూర్తులకు తెప్పోత్సవం నిర్వహించారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

గరుడ వాహనంపై శ్రీవారు



గరుడ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

సోమల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బురుజుపల్లె శ్రీవారి ఆలయంలో ఉత్సవాలను పురస్కరించుకొని స్వామివారు గరుడ వాహనంపై ఊరేగారు. ఆలయంలోని మూలవిరాట్‌కు విశేష పుష్పాలంకరణ చేసి అభిషేకాలు చేశారు. ఉత్సవాల్లో పాల్గొన్న టీటీడీ అన్నమాచార్య కళాకారులను సన్మానించారు. కార్యక్రమాల్లో మాజీ సర్పంచి కొల్లా హరిప్రసాద్, పురుషోత్తం, జయచంద్ర, రమేశ్‌నాయుడు, వెంకట్రామ నాయుడు, సతీశ్ నాయుడు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతే అందరి లక్ష్యం



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న లక్ష్మీదేవి

సోమల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతే అందరి లక్ష్యం కావాలని డిప్యూటీ ఎంపీడీవో లక్ష్మీదేవి అన్నారు. శనివారం నడింపల్లె సచివాలయంలో స్వామిత్ర గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా పలువురికి పలు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి, సర్పంచి వెంకటరమణ, మాజీ సర్పంచి మునిచంద్ర, ఉద్యోగులు పాల్గొన్నారు.

కందూరులో కార్తీక ఏకాదశి వైభవం



సోమల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కందూరు కన్యకా పరమేశ్వరి ఆలయంలో కార్తీక ఏకాదశిని పురస్కరించుకొని దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో పూజలు చేశారు. బజారువీధిలో ఆర్యవైశ్య మహిళలు ముత్యాల ముగ్గులు వేసి దీపోత్సవాలు నిర్వహించారు. సోమల స్వయంభేశ్వరస్వామి ఆలయంలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.

ఆలయానికి పూజా సామగ్రి వితరణ



దాత నుంచి పూజా సామగ్రిని అందుకుంటున్న ఆలయ అర్చకులు, దాత ఇచ్చిన ఢమరుకం

చౌడేపల్లె, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయానికి దాతలు పూజా సామగ్రి విరాళంగా ఇచ్చినట్లు ఆలయ అర్చకులు వశిష్ఠాచార్యులు పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ దేవినేని కృష్ణమూర్తి, శిలామోల అంజప్ప కుటుంబ సభ్యులు రూ.5 వేలు విలువైన పూజా సామగ్రి, రూ.13 వేలు విద్యుత్ ఢమరుకం విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు.

ఘనంగా వార్షిక క్రీడోత్సవాలు



విద్యార్థుల వందనం స్వీకరిస్తున్న ప్రిన్సిపాల్ ఆజాద్‌హుస్సేన్

రామకుప్పం/శాంతిపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం కూతేగానిపల్లెలోని పరమహంస యోగానంద విద్యాలయంలో శనివారం వార్షిక క్రీడోత్సవాలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు చదువుతోపాటు ఆటల పోటీల్లోనూ విశేష ప్రతిభ కనబరచాలని ప్రిన్సిపాల్ ఆజాద్ హుస్సేన్ కోరారు. ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ పార్థీవులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఆదినారాయణ, యశోద తదితరులు పాల్గొన్నారు.

శోభాయమానంగా కార్తీక దీపోత్సవం



వనంలో దేవతామూర్తుల వద్ద కార్తీకదీపాల వెలుగులు

రామకుప్పం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కార్తీకదీపోత్సవాలు శోభాయమానంగా సాగుతున్నాయి. శనివారం అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంతోపాటు ఆవరణలోని వేంకటేశ్వరస్వామి, వినాయకస్వామి, ఆంజనేయస్వామి, పద్మావతి, శనీశ్వరాలయాలు, ఆలయం వెనుక గల త్రిమూర్తి, రాశీ, నవగ్రహ, నక్షత్ర వనాల్లో వేలాదిగా దీపాలను వెలిగించారు. దీపాల వెలుగులో వనాలు శోభాయమానంగా వెలుగుతూ భక్తులను పారవశ్యంలో ముంచాయి.

కుష్ఠు వ్యాధిపై అవగాహన తప్పనిసరి



అవగాహన ర్యాలీ

సదుం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరుకువారిపల్లె పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జాతీయ కుష్ఠు నివారణపై శనివారం సదుంలో ర్యాలీ నిర్వహించారు. క్రిములు, తుమ్మడం, దగ్గడం కారణంగా ఒకరి నుంచి మరొకరికి సోకే ప్రమాదం లేదని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పరంగా వైద్య సదుపాయం కల్పించనున్నట్లు వైద్యాధికారి చరణ్ తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు నీలకంఠ, శిఖామణి, సీహెచ్‌వోలు రషీద్, దీప, మనీషా, శివానీ పాల్గొన్నారు.

కుప్పంలో అభివృద్ధికి అందలం

● హోరెత్తిన శంకుస్థాపనలు



మున్సిపల్ పార్కు అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం తదితరులు

కుప్పం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో అభివృద్ధికి అందలం దక్కుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో అనేక అభివృద్ధి పనులు సాకారం దాల్చడానికి మార్గం సుగమమైంది. కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేశ్‌బాబు, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, రెస్కో చైర్మన్ వీజీ.ప్రతాప్, కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు తదితరులు భూమి పూజ నిర్వహించి శంకుస్థాపనలు చేశారు. కుప్పం పురపాలక సంఘం అమరావతి కాలనీలో తాగునీటి సమస్యతో ఎన్నాళ్లగానో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టారు. సమస్య పరిష్కారానికి ప్రణాళికలు రచించారు. దీంతో అమరావతి కాలనీలో రూ.6.74 కోట్ల వ్యయంతో తాగునీటి ట్యాంకు నిర్మాణ ప్రతిపాదనలు జరిగాయి. ప్రభుత్వ ఆమోదం కూడా లభించడంతో ఈ భారీ ట్యాంకు నిర్మాణ పనులకు శనివారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నంలు భూమి పూజ నిర్వహించారు. శంకుస్థాపన చేసి లాంఛనంగా పనులు ప్రారంభించారు. అలాగే కుప్పం సెంట్రల్ పార్కు (జమీందారు ఉద్యానవనం) అభివృద్ధి పనులకు శనివారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కుప్పం మున్సిపాలిటీలో పట్టణం నడిబొడ్డున ఉన్న ఈ సెంట్రల్ పార్కు చాలాకాలంగా అభివృద్ధికి నోచుకోకుండా నిర్లక్ష్యానికి గురైంది. జమీందారీ వంశస్థుల చేతినుంచి కోర్టు మున్సిపాలిటీ చేతికి వచ్చింది. కాలువలు, రోడ్ల నిర్మాణంతోపాటు కుప్పం సెంట్రల్ పార్కును రూ.9.50 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయడానికి నిర్ణయం జరిగింది. ఈ నేపథ్యంలో కుప్పం మున్సిపల్ పార్కు అభివృద్ధి పనులకు నాయకులు, ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేశ్‌బాబు మాట్లాడుతూ కుప్పంలో ప్రస్తుతం అభివృద్ధి శకం నడుస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి విజన్‌లో భాగంగా కుప్పం మున్సిపాలిటీనే కాదు, రాబోయే మూడు నాలుగేళ్లలో మొత్తం కుప్పం నియోజకవర్గమే అభివృద్ధికి చిరునామాగా మారి, మొత్తం రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తుందనడంలో ఏమాత్రం అనుమానం లేదన్నారు. వేలకోట్ల రూపాయల పెట్టుబడితో పలు జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలు తరలివస్తున్న తరుణంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభించనున్నాయని చెప్పారు. కార్యక్రమాల్లో కౌన్సిలర్లు జిమ్ దాము, సోమశేఖర్, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్రశేఖర్, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, నాయకులు గోపీనాథ్, మంజునాథ్, వేణుగోపాల్, ఆర్‌ఆర్.రవి, విష్ణు, సతీశ్, పార్టీ పదవులకు నూతనంగా ఎంపికైన నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేలాది కోట్లతో కుప్పం నియోజకవర్గ అభివృద్ధి

● మాజీ ఎమ్మెల్సీ గౌనివారి



సమావేశంలో మాట్లాడుతున్న గౌనివారి శ్రీనివాసులు

రామకుప్పం/శాంతిపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కుప్పం నియోజకవర్గంలో వేలాది కోట్లతో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు తెలిపారు. శనివారం మండల పరిధి తుమ్మిశిలో టీడీపీ పంచాయతీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రిగా, సీఎంగా చంద్రబాబు గతంలో కుప్పం నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి ఒక ఎత్తైతే, గత ఏడాదిన్నరగా సాగుతున్న అభివృద్ధి మరో స్థాయిలో ఉందన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ పథకాలను నేతలు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, తద్వారా రానున్న స్థానిక ఎన్నికల్లో వందకు వంద శాతం స్థానాల్లో ఎన్డీఏ అభ్యర్థులు భారీ మెజారిటీలతో గెలుపు సాధించేలా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టరు విశ్వనాథనాయుడు, టీడీపీ శాంతిపురం మండల అధ్యక్షుడు నందిగంఉదయ్‌కుమార్, నేతలు విజయరామిరెడ్డి, గోపాల్‌సుగుణమ్మ, శేఖర్, సింగిరిశ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఒకరి మృతి



సుబ్రహ్మణ్యం (ఫైల్ ఫొటో)

బైరెడ్డిపల్లె, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకులకొత్తూరు గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం(35) శుక్రవారం రాత్రి రోడ్డుప్రమాదంలో మృతిచెందడం వారి కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. కర్ణాటక రాష్ట్రం చింతామణి సమీపంలోని ఓ పౌల్ట్రీఫారంలో ఇన్‌చార్జిగా పనిచేస్తున్నాడు. సుబ్రహ్మణ్యం తన స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా చింతామణి సమీపంలో రోడ్డుప్రమాదానికి గురై మృతిచెందాడు. బైరెడ్డిపల్లె సింగిల్‌విండో చైర్మన్ నాగరాజు శనివారం ఆకులకొత్తూరు గ్రామానికి వెళ్లి సుబ్రహ్మణ్యం మృతదేహానికి నివాళులర్పించారు.

అర్హులందరికీ సొంతింటి సౌకర్యం కల్పిస్తాం



సమీక్షలో మాట్లాడుతున్న రంగనాథ్

వి.కోట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అర్హులందరికీ సొంతింటి నిర్మాణానికి సీఎం చంద్రబాబు కట్టుబడి ఉన్నారని.. రాష్ట్ర వేర్‌హౌస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రంగనాథ్ అన్నారు. శనివారం వి.కోట ఐకేపీ భవన్‌లో మండల పరిధి గృహనిర్మాణ సంస్థ డీఈ శ్రీరాములు నేతృత్వంలో గృహనిర్మాణ లబ్ధిదారుల జియోట్యాగింగ్ అంశంపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం అర్హులైన పేదలను గుర్తించి వారి పూర్తి వివరాలను జియోట్యాగ్ చేయాలని ఆదేశించిందని.. ఆ దిశగా చర్యలు తీసుకోవాని సేచించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు రాంబాబు, ఏఈ హేమంత్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవో భాస్కర్, సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ మాఫియాపై చర్యలు తీసుకోవాలి



అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న దళిత సంఘ నాయకులు

పుంగనూరు, నవంబరు 15 (ఆంధ్ర జ్యోతి): పుంగనూరులోని ప్రైవేటు ఆస్పత్రుల్లో జరుగుతున్న దోపిడీని నియంత్రించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని దళిత సంఘ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రాజన్న మాట్లాడుతూ పుంగనూరు ప్రభుత్వ వైద్యాధికారి శివప్రసాద్ ప్రైవేటు ఆస్పత్రి నిర్వహిస్తూ ఫిబ్రవరిలో దళితుడైన నాగరాజు మృతికి కారకుడయ్యాడని జిల్లా కలెక్టర్, డీఎంఅండ్‌హెచ్‌వోలకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు కనీసం విచారణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రులకు రోగులు వెళ్లిన వెంటనే వివిధ పరీక్షల పేరుతో దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చిన్నరాయుడు, రాజా, కుమార్‌రెడ్డి, మణి, పాపన్న, దివాకర్, చిన్నప్ప పాల్గొన్నారు.

శ్మశానం అభివృద్ధికి చర్యలు



శ్మశానాన్ని శుభ్రం చేయిస్తున్న అధికారులు

రామకుప్పం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని గాండ్ల శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని గాండ్ల కులస్థులు కోరారు. పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో నిండిపోయి శవాల ఖననం, దహనక్రియలకు అసౌకర్యంగా మారింది. దీంతో గాండ్లకులస్తులు చందాలు వేసుకుని గత నాలుగు రోజులుగా పొక్లయిన్‌తో శుభ్రం చేయించారు. శ్మశాన భూమిని సర్వే చేయించి, పూర్తిస్థాయి ప్రహరీ ర్మాణానికి నియోజకవర్గ ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కోరారు.

పుస్తక పఠనంతోనే ఉన్నత లక్ష్యాలు సాధ్యం



విద్యార్థులతో కలసి పుస్తక పఠనం చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ శమిపతి

పుంగనూరు రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పుస్తకాలు చదవడంతో ఉన్నత స్థానాలకు వెళ్లొచ్చని పుంగనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.శమిపతి చెప్పారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక గ్రంథాలయంలో ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ పుస్తకాలు, వార, దినపత్రికలు చదవడం అలవాటు చేసుకోవాలని.. తద్వారా జ్ఞానం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి తులసీనాయక్, విశ్రాంత ఉపాధ్యాయులు వెంకటపతి, రెడ్డెప్ప, న్యాయవాది తోటగిరిధర్, ఇంతియాజ్, ఉజ్జాయిని ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



పుంగనూరులో మాట్లాడుతున్న సీఐ సుబ్బరాయుడు



సోమలలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

పలమనేరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పలమనేరు మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమం అనంతరం ప్లాస్టిక్ ప్లాస్టిక్ నిషేధిత గ్రీన్ కార్యాలయంగా మార్చేందుకు ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ సంస్థ అందజేసిన స్టీల్ వాటర్ బాటిళ్లను మున్సిపల్ కార్యాలయ సిబ్బందికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి, మున్సిపల్ మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్, మెప్మా సీఎంఎం బాబా, టీడీపీ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

● **ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో** : పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పిచ్చిమొక్కలు తొలగించారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

● **పుంగనూరు రూరల్:** విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ బాధ్యతగా తీసుకోవాలని పుంగనూరు సీఐ సుబ్బరాయుడు అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం స్థానిక బసవరాజ ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల ఆవరణ లో సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ గల్లా గంగాధర్‌నాయుడు, విశ్రాంత డీఎస్పీ కె.సుకుమార్ బాబు, బీజేపీ నాయకుడు అయూబ్ ఖాన్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

● శుభారాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పచ్చదనంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్, అధ్యాపకులు సోమరాజు, శ్రీనివాసులు, అనిల్‌కుమార్, పవిత్ర సామిదాభాను తదితరులు పాల్గొన్నారు.

● **సోమల:** వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత ప్రధానమని ప్రిన్సిపాల్ అమరేంద్రకుమార్ తెలిపారు. శనివారం స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కోటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ పీవో గౌతం, అధ్యాపకులు, వైద్యసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

● **చౌడేపల్లె** : గ్రామాల్లో శుభ్రత, పచ్చదనం ప్రధాన లక్ష్యమని ఎంపీడీవో లీలామాధవి పేర్కొన్నారు. శనివారం ఆమె స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈవోఆర్డీ కృష్ణవేణి, ఏవో షబ్బీర్‌అలీ, పంచాయతీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

● **కల్లూరు** : పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యతగా తీసుకోవాలని ప్రిన్సిపాల్ తులసీరాం తెలిపారు. పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి నందవనం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సురేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



స్వచ్ఛతాహి సేవా వారోత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే మురళీమోహన్

చిత్తూరు సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రత మనందరి బాధ్యత అని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. శనివారం మండలంలోని బండివాళ్లఊరులో స్వచ్ఛతాహీ సేవా వారోత్సవాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, తడిచెత్త, పొడి చెత్తను వేరుచేసే విధానాన్ని అనుసరించాలని చెప్పారు. అనంతరం స్థానికులతో కలసి గ్రామంలో చెత్త తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు మురార్జీ యాదవ్, బంగారుపాళ్యం మండల అధ్యక్షుడు ధరణి నాయుడు, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబీ, మార్కెట్ కమిటీ సభ్యులు బండి హరిప్రసాద్ నాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు అవినేని కృష్ణమూర్తి, నేతలు వల్లేరు అమర్‌నాథ నాయుడు, అవినేని మాధవ నాయుడు, విజయేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఎస్‌డీజీ థీమ్‌పై శిక్షణ

వెదురుకుప్పం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎల్ఎస్‌డీజీ థీమ్-5పై శిక్షణ జరిగింది. ఈ శిక్షణ తరగతిలో కార్వేటినగరం ఎంపీడీవో సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఉచిత ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

బంగారుపాళ్యం నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని న్యూ ఫ్రెండ్స్ మెడికల్స్ అండ్ క్లీనిక్ వారిచే ఊపిరితిత్తుల వ్యాధులపై ఆదివారం ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సాహుల్ శనివారం తెలిపారు. అదే విధంగా సంత వీధిలోని ప్రభుత్వ పాఠశాలలో గ్రేడ్స్, ఆర్వీఎస్ ఆసుపత్రి వారు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరంలో షుగర్, బీపీ, చిన్నపిల్లల వ్యాధులు, గర్భకోశ వ్యాధులపై వైద్యులు వైద్యం చేస్తారని గ్రేడ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు శేషాద్రి తెలిపారు.

సతీష్ కుమార్ మృతిపై భూమన వ్యాఖ్యల్లో ఆంతర్యమేంటి: టీడీపీ

చిత్తూరు సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): టీటీడీ మాజీ విజిలెన్స్ వీఎస్వో సతీష్‌కుమార్ మృతిపై మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి మాటల్లో ఆంతర్యమేమిటని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ ప్రశ్నించారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పరకామణి కేసు దర్యాప్తు కీలక దశలో ఉన్నపుడు సతీష్ కుమార్ సిట్ ముందుకువచ్చి విచారణలో పాల్గొంటే.. లోక్ అదాలత్‌లో తన మీద వత్తిడి చేసిన వైసీపీ ప్రముఖుల పేర్లు విచారణలో బయటకు వస్తాయనే భయంతోనే పక్కా ప్రణాళికతో హత్యచేశారని ఆరోపించారు.

దేశమ్మ పాలకమండలి సభ్యుడికి సన్మానం



సోమసుందరంను సన్మానిస్తున్న వాకర్స్ అసోసియేషన్

నగరి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణ పరిధిలోని టీఆర్ కండ్రిగలో దేశమ్మ ఆలయ పాలకమండలి సభ్యుడిగా నియమితులైన కె.సోమసుందరంను నగరి వాకర్స్ అసోసియేషన్ శనివారం సన్మానించారు. కార్యక్రమంలో మనోహర్, గుణశేఖర్, డాక్టర్ భక్తవత్సలం, రాజశేఖర్, భాస్కర్‌రాజు, సోము, గోపి, శరవణ, సుబ్రహ్మణ్యం రాజు, కుప్పయ్య తదితరులు తెలిపారు.

గో సంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం



ఐరాల(కాణిపాకం), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న గో సంరక్షణ ట్రస్టుకు చిత్తూరుకు చెందిన భవ్యశ్రీ శనివారం రూ.1,00,000 చెక్కు రూపంలో అందించారు. విరాళదాతకు ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రజా సమస్యల

పరిష్కారమే ధ్యేయం

శ్రీరంగరాజపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నానని ప్రభుత్వ విప్ థామస్ తెలిపారు. మండల కేంద్రమైన ఎస్ఆర్‌పురం వెలుగు కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో బాధితుల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. థామస్ మాట్లాడుతూ గంగాధరనెల్లూరు నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఇ-ఆటోను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, నిరంజన్‌రెడ్డి, గంధమనేని రాజశేఖర్ నాయుడు, ఎన్.కుమార్, బల్ల వెంకటేష్ నాయుడు, పూజారి నాగరాజు, బాలాజీ నాయుడు, రామకృష్ణ యాదవ్, దాము, దశరథ, చంద్రబాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో పనిచేస్తున్న 48 మినీ అంగన్‌వాడీ కార్యకర్తలకు మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్తలుగా ప్రమోట్ చేస్తూ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో థామస్ నియామక పత్రాలు అందించారు. అనంతరం సీడీపీవో ఎ.పద్మసుందన, అంగన్‌వాడీ కార్యకర్తలు థామస్‌ని సన్మానించారు. స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మండల రెవెన్యూ కార్యాలయం ఆవరణలో చెత్తను తొలగించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లోకనాథం పిళ్లై, ఎంపీడీవో వనజ, ఏపీఎం లలిత, ఏపీఎం రోజా తదితరులు పాల్గొన్నారు.



ఇ-ఆటోను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ థామస్

తుఫాన్ బాధితురాలికి చెక్కు అందజేత

వెదురుకుప్పం: కార్వేటినగరం పెద్దహరిజనవాడలో తుఫాన్ కారణంగా ఇల్లు కోల్పోయిన బాధితురాలు చిన్నక్కకు శనివారం రాత్రి ప్రభుత్వ విప్ థామస్ ప్రభుత్వం తరపున రూ.50వేలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ కార్వేటినగరం మండల అధ్యక్షుడు చెంగ్రాయయాదవ్, పీఏసీఎస్ ఛైర్మన్ మాదిరాజు జనార్ధన్‌రాజు, నాయకులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ మండల అధ్యక్షుల ప్రమాణ స్వీకారం



శివనాయుడు, స్వామిదాస్, చెంగ్రాయయాదవ్, మోహన్‌మురళి, రుద్రయ్యానాయుడు, జయశంకర్‌నాయుడు

వెదురుకుప్పం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జీడీనెల్లూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుల పేర్లు ఖరారయ్యాయి. ఈ మేరకు ఆదివారం ఉదయం 10 గంటలకు నియోజకవర్గంలోని పెనుమూరు మార్కెట్ యార్డు ప్రాంగణంలో ప్రమాణస్వీకార కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, జీడీనెల్లూరు ఎమ్మెల్యే థామస్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. ఈ మేరకు ప్రకటన కూడా శనివారం విడుదల చేశారు. నియోజకవర్గంలో టీడీపీ మండల అధ్యక్షులుగా తాళ్లూరు శివ నాయుడు (పాలసముద్రం), పి.మోహన్‌మురళి (వెదురుకుప్పం), పెద్దినేని రుద్రయ్య నాయుడు (పెనుమూరు), స్వామిదాస్ (గంగాధరనెల్లూరు), చెంగ్రాయ యాదవ్ (కార్వేటినగరం), గంధమనేని జయ శంకర నాయుడు (శ్రీరంగరాజపురం) నియమితులైనట్లు సమాచారం అందించారు. దీంతో వీరంతా ఆదివారం పెనుమూరులో ప్రమాణస్వీకారానికి సిద్ధమయ్యారు. అదే విధంగా క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ కమిటీల ప్రమాణ స్వీకారం ఉంటుంది. తమ ప్రమాణ స్వీకార మహోత్సవానికి తరలి రావాలని ఆయా మండల టీడీపీ అధ్యక్షులుగా నియమితులైన వారు పార్టీ శ్రేణులను ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే వారు తప్పనిసరిగా పార్టీ సభ్యత్వ నమోదు కార్డులు తీసుకుని రావాలని విజ్ఞప్తి చేశారు.

30 ఏళ్లగా మండల టీడీపీ అధ్యక్షుడిగా ఏకగ్రీవం

పెనుమూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండల టీడీపీ అధ్యక్షుడిగా పి.రుద్రయ్య నాయుడు 15వసారి ప్రమాణస్వీకారం ఆదివారం చేయబోతున్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కీలకంగా వ్యవహరిస్తూ మండల ప్రజలకు, కార్యకర్తలకు అండగా ఉంటూ వస్తున్నారు. మొదటిసారిగా 1992లో మండల అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయన ఇప్పటి వరకు కొనసాగుతూనే ఉన్నారు. మధ్యలో 2014లో జడ్పీటీసీగా పనిచేసిన కాలంలో మూడు సార్లు ఇతరులు వ్యవహరించారు. ఆ తరువాత నుంచి మరలా ఆయనే కొనసాగారు.

ఎమ్మెల్యే అమర్‌కు సన్మానం



ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నేత ఎల్‌బీఐ లోకేష్ రెడ్డి

పూతలపట్టు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని టీడీపీ యువనేత, ఎల్‌బీఐ మేనేజింగ్ డైరెక్టర్ ముత్తిరేవుల లోకేష్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. శనివారం పలమనేరులోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి, దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఈనెల 19వ తేదీన శ్రీఅభయసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో ముత్తిరేవులలో నూతనంగా ఏర్పాటుచేసిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. అలాగే చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళీమోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబుతోపాటు పలువురు నాయకులను ఆయన ఆహ్వానించారు.

వేములో ముగిసిన 'ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్'



ప్రొఫెసర్ కరుణాకర్‌ను సన్మానిస్తున్న చంద్రశేఖర్

పూతలపట్టు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పి.కొత్తకోట సమీపంలోని వేము ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 10వ తేదీన ప్రారంభించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం శనివారంతో ముగిసింది. కార్యక్రమంలో అధ్యాపకులు, పరిశ్రమల నిపుణులు, పరిశోధనలో రాణించిన నిపుణులు పాల్గొన్నారు. 3డీ ప్రింటింగ్ టెక్నాలజీకి సంబంధించిన ప్రాథమిక అంశాలు, నిర్మాణ విధానాలు, వాడకాలు, పరిశ్రమల్లో అభివృద్ధి, భవిష్యత్తు అవకాశాలు తదితర అంశాలపై చర్చించారు. కళాశాల ఛైర్మన్ చంద్రశేకర్, ప్రొఫెసర్ కరుణాకరన్ పాల్గొన్నారు.

ఆలయం వద్ద ఆధ్యాత్మికం ఉట్టిపడేలా చూసుకుందాం



కాణిపాకంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆలయం వద్ద ఆధ్యాత్మికం ఉట్టిపడేలా మనమందరం కలసి చూసుకుందామని ఈవో పెంచలకిషోర్ పిలుపుపిచ్చారు. శనివారం ఆలయం వద్ద స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సిబ్బందితో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కాణిపాకంలో ర్యాలీ నిర్వహించారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా చూసుకోవాలన్నారు. ఏఈవోలు ధనంజయ, ఎస్సీ కృష్ణారెడ్డి, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ అధ్యక్షుడిగా శివనాయుడి ఎంపికపై పలువురి హర్షం

పాలసముద్రం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండల టీడీపీ అధ్యక్షుడిగా తాళ్లూరి శివ నాయుడి ఎంపికపట్ల పలువురు మండల నాయకులు హర్షం వ్యక్తంచేశారు. శనివారం సాయంత్రం టీడీపీ శ్రేణులు రంగాపురం, నరసింహాపురం కూడలి ప్రాంతాల్లో బాణసంచా పేల్చి హర్షం వ్యక్తంచేశారు. టీడీపీ అధ్యక్షుడిగా ప్రకటించినందుకు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, ప్రభుత్వవిప్ థామస్‌ల నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో పెనుమూరు మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ అరుణ్‌నాథన్, టీడీపీ నాయకులు బాలాజీ నాయుడు, శేఖర్‌రాజు, సాంబశివన్, బాలాజీ యాదవ్, నవీన్ చౌదరి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాతాశిశు సంరక్షణ అందరి బాధ్యత

చిత్తూరు రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మాతాశిశు సంరక్షణ అందరి బాధ్యత అని అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్ అన్నారు. శనివారం చిత్తూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో మాతాశిశు సంరక్షణపై ఆశా నోడల్ ఆఫీసర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గర్భం నమోదు అయిననాటి నుంచి వైద్య సిబ్బంది గర్భిణి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ నెల 17వ తేదీ నుంచి జరుగనున్న లెప్రసీ ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో జార్జ్, ఆశ నోడల్ అధికారి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత, సామాజిక భద్రతతోనే ఆరోగ్యం



విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న మేయర్ అముద

చిత్తూరు అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత, సామాజిక శుభ్రత పాటించడం ద్వారానే రోగాలను అరికట్టి ఆరోగ్యవంతమైన జీవనం సాగించగలమని మేయర్ అముద చెప్పారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నగరపాలక పరిధిలోని 7వ వార్డు కేశవరెడ్డి పాఠశాలలో వ్యక్తిగత సామాజిక భద్రతపై అవగాహన కార్యక్రమం, ఆర్టీసీ బస్టాండ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన మూత్రశాలను ఆమె ప్రారంభించారు. కేశవరెడ్డి పాఠశాలలో కరపత్రాలను ఆవిష్కరించి విద్యార్థుల చేత స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండులో నిర్మించిన నూతన మూత్రశాలను ప్రారంభించారు. అక్కడే ప్రయాణికుల చేత సామాజిక శుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. కమిషనర్ నరసింహప్రసాద్, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ఎంహెచ్‌వో లోకేష్, రెండవ డిపో మేనేజర్ రూపశ్రీ, ప్రిన్సిపాల్ ముకూబ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఎస్ కన్నన్ కళాశాలలో...

విద్యార్థి దశ నుంచే సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత కోరారు. స్థానిక బీఎస్ కన్నన్ కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కళాశాల ఆవరణలో ఆమె మొక్కలు నాటి నీరు పోశారు. ప్రిన్సిపాల్ సయ్యద్‌మౌలా, మాజీకార్పొరేటర్ కందా, అధ్యాపకులు పాల్గొన్నారు.

బిర్సా ముండా సేవలు మరువలేనివి

చిత్తూరు సెంట్రల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమరయోధుడు, గిరిజనుల ఆత్మగౌరవ పరిరక్షణకు పోరాటాలు చేసిన భగవాన్ బిర్సా ముండా సేవలు మరువలేనివని బీజేపీ శ్రేణులు కొనియాడారు. భగవాన్ 150వ జయంతిని పురస్కరించుకుని శనివారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి, గిరిజనులకు ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చంద్రన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదినారాయణ, బీజేపీ నాయకులు శ్రీనివాసులు, బాబు, దామోదరరెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు నియామక పత్రాల అందజేత

చిత్తూరు సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలకు పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ శనివారం నియామక పత్రాలు అందజేశారు. స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఇటీవల మినీ అంగన్‌వాడీ కార్యకర్త స్థాయి నుంచి మెయిన్ అంగన్వాడీ కార్యకర్తగా పదోన్నతి పొందిన వారికి ఎమ్మెల్యే నియామక పత్రాలను అందజేశారు.

స్వామిత్వ గ్రామసభ

విజయపురం(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగన్నాథపురంలో స్వామిత్వ కార్యక్రమంపై శనివారం గ్రామసభ నిర్వహించారు.గ్రామకంఠంలో నివాసం ఉంటున్న ప్రతి ఒక్కరినీ గుర్తించి, వారికి శాశ్వత ఇంటి పట్టా మంజూరు చేయాలని ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీడీవో రాజేంద్ర తెలిపారు.

ఆధునిక టెక్నాలజీతో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోండి

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆధునిక టెక్నాలజీతో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని ప్రజలందరూ మమేకం కావాలని చిత్తూరు డీఎల్‌సీవో వెంకటరమణ చెప్పారు. సహకార వారోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శనివారం సీడీసీఎంఎస్, జిల్లా కో-ఆపరేటివ్ ప్రింటింగ్ ప్రెస్ సంయుక్త ఆధ్వర్యంలో సీడీసీఎంఎస్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. డీఎల్‌సీవో మాట్లాడుతూ మార్కెటింగ్ టెక్నాలజీతో కో-ఆపరేటివ్ సంస్థలు మెరుగుపడాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్లు కిశోర్, శ్రీనివాసులురెడ్డి, అరీఫుల్లా, సీడీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ శ్రీధర్‌నాయుడు, కో-ఆపరేటివ్ ప్రింటింగ్ ప్రెస్ సీఈవో మురళీ, యాదమరి విండో సీఈవో గుణ తదితరులు పాలల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి సహకరించండి

● ట్రావన్‌కోర్ బోర్డు అధ్యక్షుడిని కోరిన చిత్తూరు డీపీటీవో



ట్రావన్‌కోర్ దేవస్థానం బోర్డు అధ్యక్షుడు ప్రశాంత్‌కు శ్రీవారి ప్రసాదం అందజేస్తున్న డీపీటీవో రాము

చిత్తూరు రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఆర్టీసీ బస్సుల ద్వారా శబరిమలకు భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న దృష్ట్యా శనివారం ట్రావన్‌కోర్ దేవస్థానం బోర్డు అధ్యక్షుడు ప్రశాంత్‌తో చిత్తూరు డీపీటీవో రాము మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీఎస్ఆర్టీసీ బస్సులకు పార్కింగ్ స్థలం, సిబ్బందికి రెస్ట్ రూంల విషయంలో సహకరించాలని కోరినట్లు తెలిపారు. ఇందుకు ఆయన అంగీకరించారని రాము పేర్కొన్నారు. అనంతరం దేవస్థానం అధ్యక్షుడు ప్రశాంత్‌కు శ్రీవారి ప్రసాదం అందజేశారు. ఆర్టీసీ ప్రధాన కార్యాలయ మార్కెటింగ్ చీఫ్ మేనేజర్ విజయగీత తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

గుడిపాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే జగన్మోహన్ కుమారుడు నితీష్‌చౌదరి పుట్టినరోజు సందర్భంగా నిరుపేదలకు శనివారం జీజేఎం ట్రస్టు ద్వారా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. జీజేఎం యూత్ సభ్యులు రాజేష్, ఆదాం, మురళి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

వీధి శునకాల నియంత్రణకు నోటీసుల జారీ

చిత్తూరు అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): వీధి శునకాల నియంత్రణ విషయంపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు చిత్తూరు నగరపాలక సంస్థ చర్యలు చేపట్టింది. కమిషనర్ ఆదేశాల మేరకు ఎంహెచ్‌వో లోకేష్ ఆధ్వర్యంలో నగరపాలక పరిధిలోని విద్యా సంస్థలు, ఆస్పత్రులు, కాంప్లెక్సులు, బస్టాండ్లు, బస్ డిపోలు, రైల్వే స్టేషన్లలో వీధి శునకాలు ప్రవేశించకుండా సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత సంస్థలకు నోటీసులు జారీ చేసింది.

కుష్ఠు రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ఐరాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఐరాల ప్రభుత్వాసుపత్రి డాక్టర్ రెడ్డెప్ప పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రమైన ఐరాలలో కుష్ఠు వ్యాధి నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పిస్తు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రేపటినుంచి కుష్ఠువ్యాధి నివారణలో భాగంగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహిస్తారని తెలిపారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

చిత్తూరు రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల్లోనే అపారజ్ఞానం దాగి ఉంటుందని, యువత వాటిని సద్వినియోగం చేసుకోవాలని సామాజిక సేవాకార్యకర్త పార్థసారథి నాయుడు అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థలో జరుగుతున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ గజేంద్రబాబు, పాఠకులు పాల్గొన్నారు.